క్లుప్తంగా

నేటి నుంచి మల్లవరంలో గడప గడపకు మన ప్రభుత్వం

పొదిలి రూరల్: మండలంలోని మల్లవరం సచివాలయం పరిధిలోని మల్లవరం, కొస్తాలపల్లి, అక్కచెరువు, జువ్వలేరు గ్రామాల్లో బుధవారం నుంచి మూడు రోజులపాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమానికి మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

కోడిపందేల నిర్వాహకులకు సంకెళ్లు

గిద్దలూరు రూరల్: మండలంలోని కెఎస్ పల్లె గ్రామ శివారు ప్రాంతంలో కోడిపందేలు నిర్వహిస్తున్న ఆరుగురిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. అందిన సమాచారం మేరకు కోడిపందేలు ఆడుతున్నారని సమాచారం అందడంతో ఆయన తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. కోళ్లతో పాటు రూ.1190 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పంట నమోదుకు సహకరించాలి

గిద్దలూరు రూరల్: పంట నమోదు కార్యక్రమానికి రైతులు సహకరించాలని స్థానిక ఏఓ విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. మండలంలోని కొత్తకోటలో మంగళవారం రైతులకు ఈ-క్రాప్ నమోదుపై అవగాహన కల్పించారు. రైతు భరోసా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సంచాలకుల ద్వారా రైతులు వ్యవసాయంలోని సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రతి రైతు తమ పంటలను ఈ-క్రాప్ చేయించుకోవాలన్నారు. వేసవిలో లోతైన దుక్కిలు వేసుకుంటే అనేక లాభాలున్నాయన్నారు. విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, గ్రామ వ్యవసాయ సంచాలకులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొమరోలు: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పొలాల్లో పంటలు వేసిన రైతులు తప్పనిసరిగా ఈ-పంట ప్రక్రియ నమోదు చేయించుకోవాలని గిద్దలూరు వ్యవసాయ సంచాలకులు బాలాజీనాయక్ తెలిపారు. మండలంలోని రెడ్డిచెర్ల, రాజుపాలెం, అల్లినగరం, సూరవారిపల్లె గ్రామాల్లో ఈ-పంట నమోదు ప్రక్రియ జరుగుతున్న విధానాన్ని వ్యవసాయ సంచాలకులు బాలాజీనాయక్ మంగళవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పంటలు వేసిన ప్రతి ఒక్కరూ ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని చెప్పారు. మండల వ్యవసాయశాఖ అధికారి కె.రాజశ్రీ, రైతులు పాల్గొన్నారు.

గేదె దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మార్కాపురం: మండలంలోని బొందలపాడు గ్రామంలో మంగళవారం సాయంత్రం భూపతిపల్లి సచివాలయ కన్వీనర్ భవనం వెంకట్రామిరెడ్డిని గేదె పొడవడంతో తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి హుటాహుటిన తన వాహనంలో ఎక్కించుకుని చికిత్స నిమిత్తం ఒంగోలు తీసుకెళ్లారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న రామాంజనేయరెడ్డి

తర్లుపాడు: మండల జేసీఎస్ కన్వీనర్‌గా ఉమ్మారెడ్డిపల్లికి చెందిన కె.రామాంజనేయరెడ్డి నియమితులయ్యారు. మంగళవారం ఉదయం మార్కాపురంలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని ఆయన నివాసంలో కలిసి నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భముగా ఎమ్మెల్యే కేపీని ఘనంగా సన్మానించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. తనపై నమ్మకముంచి బాధ్యతలు అప్పజెప్పిన ఎమ్మెల్యేకు, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, మండల కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రుణాల రికవరీ నూరు శాతం చేయాలి

మార్కాపురం: మహిళా స్వయం సహాయక బృందాలు తీసుకున్న రుణాలను నూరు శాతం రికవరీ చేయాలని డీఆర్‌డీఏ పీడీ రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం మార్కాపురం వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆసరాతోపాటు ఇతర పథకాలను కూడా అమలు చేసి మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయడంతోపాటు రికవరీపై కూడా దృష్టిపెట్టి ఏ గ్రేడ్‌లోనికి తీసుకురావాలని చెప్పారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీని సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఎం రమేష్‌బాబు, సీసీ మనోకుమారి, నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు ప్రాధాన్యం

మార్కాపురం: శాంతిభద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని మార్కాపురం రూరల్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర నాయక్ చెప్పారు. ఆయన అర్ధవీడు నుంచి బదిలీపై మార్కాపురం రూరల్ ఎస్సైగా నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన సుమన్ త్రిపురాంతకం ఎస్సైగా బదిలీపై వెళ్లారు.

వలంటీర్లకు వందనం

సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించి దరఖాస్తు చేయించడం, ఆపద సమయాల్లో అండగా నిలవడం, ఒకటో తేదీ తెల్లవారుజామునే అవ్వాతాతల తలుపుతట్టి పింఛను డబ్బు చేతికందించి వారి ఆశీస్సులు పొందడం.. ఇదీ వలంటీర్ల పని. వాస్తవానికి వలంటీర్లు చేస్తున్నది పనికాదు సమాజసేవ. కేవలం రూ.5 వేల గౌరవ వేతనం తీసుకుంటున్న వలంటీర్లు కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలు సైతం లెక్క చేయకుండా ప్రజలకు అండగా నిలిచి మన్ననలు పొందారు.

ఒకటో తేదీనే ఠంచన్‌గా పింఛన్



నా వయసు 63 ఏళ్లు. నా భర్త 20 ఏళ్ల క్రితం మరణించాడు. అనారోగ్యం కారణంగా కూలి పనులకు వెళ్లలేక ఇంటి వద్దే ఉంటున్నా. ప్రభుత్వం అందించే పింఛనే జీవనాధారం. ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే మా ఇంటికి వలంటీరు వెంకటరెడ్డి వచ్చి నాకు వృద్ధాప్య పింఛను 2,750 రూపాయలు ఇస్తున్నాడు. గతంలో పింఛను కోసం పంచాయతీ కార్యాలయం వద్ద క్యూలో గంటలకొద్ది నిలబడాల్సి వచ్చేది. రెండు లేదా మూడు రోజులు పింఛను కోసం పడిగాపులు కాసిన సందర్భాలున్నాయి. ఇప్పుడు మాత్రం ఎక్కడికీ వెళ్లే పనిలేకుండా వలంటీరే నేరుగా మా ఇంటికొచ్చి పింఛను ఇస్తున్నాడు. – టి.చిన్నక్క, జగన్నాథపురం (తర్లుపాడు)

చిత్తశుద్ధితో పని చేస్తున్నా:



నేను వలంటీర్ కాకముందు చదువు పూర్తి చేసుకుని ఇంటి వద్దే ఉంటూ వ్యవసాయ పనులు చేసుకుంటున్నా. జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత నన్ను వలంటీర్‌గా నియమించారు. అప్పటి నుంచి తన పరిధిలో ఉన్న 50 కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తూ నిబద్ధతతో పనిచేస్తూ వారి మన్ననలు పొందుతున్నా. నా పరిధిలో ఉన్న వృద్ధులకు ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ అందించినప్పుడు వారి కళ్లలో ఆనందం వెల్లివిరిసేది. అప్పుడు నాకు ఎంతో సంతోషంగా ఉండేది. స్థానికంగా ఒక వైపు తనకు ఉద్యోగంతో పాటు నలుగురికి ఉపయోగపడే పని కల్పించిన ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటా. గొల్లవీటి శ్రీనివాసులు, వలంటీర్, ఆదిమూర్తిపల్లె

ప్రజా సేవకు అవకాశం దక్కింది:



జగనన్న ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థ తీసుకురాకుంటే నిరుద్యోగిగా గ్రామంలోనే ఉండిపోయే వాడిని. వలంటీర్‌గా పని లభించడంతో ప్రజా సేవకు అవకాశం దక్కింది. డిగ్రీ చదువు పూర్తి చేసుకుని ఉద్యోగానికి దూరంగా ఎక్కడికి వెళ్లాలనే సమయంలో జగనన్న ప్రభుత్వం వలంటీర్‌గా పనిచేసే అవకాశం కల్పించింది. నా పరిధిలో ఉన్న కిడ్నీ బాధితులు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లినప్పటికీ వారి వద్దకు వెళ్లి మరీ పెన్షన్ అందజేస్తున్నా. హైదరాబాద్, బెంగళూరు వెళ్లి పింఛన్ ఇచ్చి వస్తుంటే వారి సొంత బంధువు వచ్చినంతగా నన్ను ఆదరించే వారు.
బొల్లు నవీన్, కేఎస్‌పల్లె

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం


కంభంలో మహిళకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే అన్నా

- ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

కంభం: పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. మంగళవారం కంభం-3 సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి నాలుగేళ్ల పాలన ప్రజలకు అందిన సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేశారు. ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు, ప్రజలు పూలమాలలు, శాలువాలతో సన్మానించి ఘన స్వాగతం పలికారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ప్రభుత్వం పని చేస్తోందని, అన్ని వర్గాల ప్రజలకు అర్హత ఆధారంగా సంక్షేమ పథకాలు అందుతున్నందునే ధైర్యంగా గ్రామాల్లో తిరుగుతున్నామన్నారు. ప్రజలు సంతోషంగా తమకు స్వాగతం పలుకుతున్నారని పేర్కొన్నారు. నవరత్నాల హామీలను వంద శాతం అమలు చేస్తున్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలన్నారు. సర్పంచ్ పల్నాటి బోడయ్య, ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్ వలి, ఏఎంసీ మాజీ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్, ఎంపీటీసీలు రఫీ, ఆనంద్, నాగరాజు, కోఆప్షన్ సభ్యుడు సలీం, మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, జేఏసీ కన్వీనర్ డిష్ మున్నా, సొసైటీ చైర్మన్ ఫజుల్లా రహమాన్, హజరత్ గూడెం సర్పంచ్ మహబూబ్ పీరా, ఉప సర్పంచ్ సయ్యద్ ఖాసిం, నాయకులు దేవరకొండ వెంకట్, సబ్బసాని సాంబశివారెడ్డి, కొత్తపల్లి శ్రీను, కటికల భాస్కర్, గంగారపు కృష్ణ, ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, కార్యదర్శి బ్రహ్మయ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వలంటీర్లపై పవన్ వ్యాఖ్యలు దురదృష్టకరం

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గ్రామ వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. వలంటీర్లు నాలుగేళ్లుగా ప్రజలకు-ప్రభుత్వానికి అనుసంధానకర్తలుగా ఉండి కేవలం రూ.5 వేల గౌరవ వేతనం పొందుతూ ప్రజల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కరోనా కష్టకాలంలో వలంటీర్ల సేవలు మరువలేనివన్నారు. ఎవరూ బయటకు రాని పరిస్థితుల్లో వలంటీర్లు ప్రజలకు ధైర్యం చెబుతూ మెరుగైన సేవలందించారని గుర్తు చేశారు. వలంటీర్లను చిన్నచూపు చూస్తూ ఇష్టానుసారం మాట్లాడం సమంజసం కాదన్నారు. ఆయన స్థాయికి తగ్గట్టు పవన్ కళ్యాణ్ మాట్లాడాలని, అనవసరంగా బురదచల్లొద్దని ఎమ్మెల్యే అన్నా రాంబాబు హితవు పలికారు.

సచివాలయ వ్యవస్థతో ప్రజలకు మేలు


మహిళకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

- మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

పెద్దదోర్నాల: సచివాలయ వ్యవస్థతో ప్రజలకు మేలు జరుగుతోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండల పరిధిలోని యడవల్లిలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంటా వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ మన రాష్ట్రంలో ఉందన్నారు. సత్వర సేవలు అందుతుండటంలో మిగిలిన రాష్ట్రాలు సైతం సచివాలయ వ్యవస్థ ఏర్పాటుకు సుముఖత చూపుతున్నాయని పేర్కొన్నారు. ఒక్కో సచివాలయంలో 11 మంది సిబ్బందిని నియమించి ప్రభుత్వం సేవలు ప్రజలకు చేరువ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన‌రెడ్డికి దక్కుతోందని కొనియాడారు. గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలను తీసుకొచ్చి గ్రామీణ ప్రాంత ప్రజలకు విలువైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటోందని కొనియాడారు. ఒకప్పుడు అవ్వా తాతలకు 60 ఏళ్లు దాటినా పెన్షన్ మంజూరు అయ్యే పరిస్థితి లేదని, ఇప్పుడు అవ్వా తాతలకు అవసరమైన కనీస సౌకర్యాలు ఆ ప్రాంత వలంటీర్లే చూసుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతరత్రా సేవలు వలంటీర్ల ద్వారా ప్రజలకు వారి ఇంటి వద్దే అందించడం అభినందనీయమని కొనియాడారు. సంక్షేమ పాలన అందించేందుకు ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. గత ఎన్నికలకు ముందు నిర్వహించిన పాదయాత్రలో ప్రజల కష్టాలు చూసిన జగనన్న వాటి పరిష్కారానికి వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలు తీసుకొచ్చి మెరుగైన సేవలందిస్తున్నారని మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ గుర్తు చేశారు. వివాహ వ్యవస్థకు భిన్న భాష్యం చెప్తూ మన సంప్రదాయాల పట్ల గౌరవం లేని వ్యక్తి పవన్ కళ్యాణ్ అని, మహిళలను నీచంగా మాట్లాడి కించపరుస్తున్న ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనంతో వలంటీర్లు ప్రజలకు సేవలందిస్తున్నారని, కోవిడ్ సమయంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు అండగా నిలిచారని, అటువంటి వారిపై నిందలు మోపడం హేయమైన చర్యగా అభివర్ణించారు. గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామస్తులు భారీగా పాల్గొన్నారు. నాలుగేళ్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలను మంత్రి సురేష్ వివరించారు. ప్రభుత్వ పథకాలతో కూడిన కరపత్రాలను ప్రతి కుటుంబంలోని పెద్దలకు అందజేసి వారు ప్రభుత్వం నుంచి ఎంత లబ్ధి పొందారో వివరించారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటే పథకాలన్నీ సక్రమంగా అందుతాయని మంత్రి వివరించారు. డీఎల్‌డీఓ సాయికుమార్, ఎంపీడీఓ విజయ, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అమిరెడ్డి రామిరెడ్డి, వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు వెన్నా కాశిరెడ్డి, మాజీ ఎంపీపీ జోగి వెంకట నారాయణ, మండల నాయకులు గుమ్మా యల్లేష్, పొందుగుల మల్లారెడ్డి, యక్కంటి శ్రీకాంత్‌రెడ్డి, చిట్యాల వెంకటేశ్వరరెడ్డి, వెన్నా పాండురంగారెడ్డి, అలుగుల లక్ష్మయ్య పాల్గొన్నారు.

గడప గడపలో ఘన స్వాగతం


మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని, ఏ ఇంటికి వెళ్లినా అపూర్వ ఆదరణ లభిస్తోందని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి మంగళవారం మార్కాపురం మండలంలోని బొందలపాడు గ్రామ పంచాయతీలో పర్యటించారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందించిన పథకాల గురించి వివరించారు. సమస్యలు ఉంటే చెప్పాలని ప్రజలను కోరారు. ×అవ్వా పింఛను వస్తోందా, తాతా ఎలా ఉన్నావ్౹ అంటూ భుజం తట్టి ఆప్యాయంగా పలకరించారు. పథకాల మంజూరులో అర్హులై ఉంటే చాలని, వలంటీర్ల ద్వారా లబ్ధిపొందవచ్చన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలు తమకు అవసరమైన వివిధ రకాల సర్టిఫికెట్లు పొందవచ్చని, దీనిని ఉపయోగించుకోవాలని ప్రజలకు సూచించారు. తొలుత ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎం.లక్ష్మీదేవి, కోఆప్షన్ సభ్యులు షేక్ మహమ్మద్ రఫీ, కె.శివారెడ్డి, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ సంతాపం

దర్శి: సాగర్ కాలువలో బస్సు పడి మృతి చెందిన సంఘటనలో ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి కుటుంబాలకు ప్రకటించిన పరిహారం పై హర్షం వ్యక్తం చేశారు.

సహాయక చర్యల్లో వైఎస్సార్ సీపీ నాయకులు

దర్శి: బస్సు బోల్తా పడిన దుర్ఘటనలో మృతులను బయటకు తీసేందుకు 7వ వార్డు కౌన్సిలర్ ఆవుల జ్యోతి శివారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ అమీన్‌బాషా (మిల్లర్ బుజ్జి) తదితర నాయకులు, కొత్తరెడ్డి పాలెం గ్రామవాసులు, దర్శి పట్టణ వాసులు సహాయక చర్యలు చేసేందుకు ముందుకు వచ్చారు. బస్సులో నుంచి క్షతగాత్రులను బయటకు తీసేందుకు ప్రమాద బారిన పడతామని కూడా లెక్కచేయకుండా వారిని కాపాడే ప్రయత్నం చేశారు. వారికి ఉన్న వాహనాలైన పొక్లెయిన్లు, బుల్డోజర్లు, క్రేన్‌లను పోలీసుల కోరిక మేరకు స్వచ్ఛందంగా తీసుకు వచ్చి మోకుల సాయంతో బస్సును బయటకు లాగే ప్రయత్నం చేశారు. తాళ్లు వేసి బస్సులోని వారిని బయటకు లాగారు. అలాగే కాలువలోకి నిచ్చెనలు వేసి బస్సులోని వారిని పైకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన రేపు

రాచర్ల: మండలంలోని ఆకవీడు, ఆరవీటికోట, జేపీ చెరువు, చోళ్లవీడు, అనుములపల్లె, పలుగుంటిపల్లె, ఓబుల్‌రెడ్డిపల్లె గ్రామాల్లో ఈ నెల 13వ తేదీ గురువారం 2 కోట్ల రూపాయలతో సిమెంటు రోడ్ల నిర్మాణం కోసం శంకుస్థాపనలు ఉన్నాయని, ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు హాజరువుతున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యేలం మురళీకృష్ణ మంగళవారం తెలిపారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలు సీజ్

- ఎంవీఐ మాధవరావు


వాహనాల ధ్రువీకరణ పత్రాలు తనిఖీ చేస్తున్న ఎంవీఐ మాధవరావు

మార్కాపురం: ద్విచక్ర వాహనదారులు, ఆటోడ్రైవర్లు నిబంధనలు అతిక్రమిస్తే సీజ్ చేస్తామని మార్కాపురం మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు హెచ్చరించారు. మంగళవారం ఆయన నేషనల్ హైవేలో వాహనాలు తనిఖీ చేశారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ఆటోవాలాలు, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 7 వాహనాలకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని, వాహనదారులు నిబంధనలు పాటించాలని చెప్పారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని, ప్రతి వాహనానికి కచ్చితంగా ఇన్సూరెన్స్ చేయించాలని స్పష్టం చేశారు. ముందు వెళ్తున్న వాహనాలను ఓవర్‌టేక్ చేసే విధానాన్ని మానుకోవాలని హితవు పలికారు. స్కూల్ బస్సు డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలని, లేనివారు మార్కాపురం ఎంవీఐ కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు.

గుండెపోటుతో ఆర్మీ జవాన్ మృతి


ఆర్మీ జవాన్ పిచ్చయ్య భౌతిక కాయం

రాచర్ల: మండలంలోని చినగానిపల్లె గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ ఈర్లపాటి పిచ్చయ్య (37) ఆదివారం మధ్యాహ్నం హిమాచల్ ప్రదేశ్‌లో గుండెపోటుతో మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. పిచ్చయ్య గడిచిన 15 ఏళ్లుగా ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం ఉదయం టిఫిన్ చేసేందుకు తోటి ఆర్మీ జవాన్లతో కలిసి క్యాంటీన్‌కు వెళ్లాడు. ఆ సమయంలో నడుపు నొప్పి రావడంతో యూనిట్‌లో ఉన్న వైద్యశాలలో చేర్పించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం ఆర్మీ హాస్పిటల్‌కు తరలించి వైద్యం చేస్తున్న సమయంలో మృతి చెందాడు. పిచ్చయ్యకు భార్య నిర్మలతో పాటు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని బుధవారం చినగానిపల్లె గ్రామానికి తరలించి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు బంధువులు తెలిపారు.

దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేయాలి


గోదాన్‌లో ఉపకరణాలు చూపుతున్న గోపాల్‌రెడ్డి

మార్కాపురం టౌన్: మార్కాపురం మార్కెట్ యార్డులో గత రెండేళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్న దివ్యాంగుల ఉపకరణాలను వెంటనే పంపిణీ చేయాలని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు డి.గోపాల్‌రెడ్డి మంగళవారం కోరారు. 2020లో అలీంకో సంస్థ జిల్లా వ్యాప్తంగా సర్వే చేసి 2 వేల మంది అర్హులైన దివ్యాంగులను ఎంపిక చేసిందని, వారి కోసం పరికరాలు తెప్పించి మార్కాపురం మార్కెట్ యార్డులో ఉంచిందన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పరికరాలు పంపిణీ చేయిస్తే దివ్యాంగులు ఉపయోగించుకుంటారని విజ్ఞప్తి చేశారు. అలీంకో సంస్థ సీనియర్ మేనేజర్‌ను సంప్రదించగా ఆగస్టు 15వ తేదీన జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారని, మార్కాపురం, కనిగిరిలో క్యాంపులు ఏర్పాటు చేసి దివ్యాంగులకు ఉపకరణాలు ఇప్పించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి: ఎంపీపీ

పెద్దదోర్నాల: మండలంలో నెలకొన్న సమస్యలను అధికారులు చిత్తశుద్ధితో పరిష్కరించాలని ఎంపీపీ గుమ్మా పద్మజ కోరారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో మంగళవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీడీఓ విజయ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. మండలంలోని ముఖ్య సమస్యలపై ఆయా శాఖల అధికారులతో ఎంపీపీ సమీక్షించారు. డిప్యూటీ తహసీల్దార్ అరుణాదేవి, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు పరుచూరి సురేఖ, దర్శనం నాగయ్య, సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ భాస్కర్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భ్రమరాంబాదేవి, ఏపీఓ అన్నపూర్ణ కార్యదర్శి మోహన్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా ఈయూ ఆవిర్భావ దినోత్సవం


జెండాను ఆవిష్కరిస్తున్న ఈయూ జోనల్ సహాయ కార్యదర్శి శాస్త్రి

మార్కాపురం: ఏపీ పీటీడీలోని ఎంప్లాయీస్ యూనియన్ 72వ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక డిపో వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ సహాయ కార్యదర్శి ఎస్‌వీఎస్ శాస్త్రి యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఆర్టీసీ ఉద్యోగుల చిరకాల కోరిక నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రీజినల్ ఉపాధ్యక్షుడు సీహెచ్ జనార్దనరావు మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం కోసం, సంస్థ మనుగడ కోసం ఎంప్లాయీస్ యూనియన్ పోరాటాలు చేసిందని, డిపోలోని ఉద్యోగుల సమస్యలపై ఎప్పుడికప్పుడు స్పందిస్తూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రీజినల్ ప్రచార కార్యదర్శి శేఖర్‌నాయుడు, ఉపాధ్యక్షుడు డీఎం నాయక్, కోశాధికారి రహమత్, గ్యారేజీ అధ్యక్ష, కార్యదర్శులు రాజేష్ మోహనరావు, చిన్నబాషా, వలి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.